# పరమతసహనం- నిరాడంబర వ్యక్తిత్వం

## బిస్మిల్లాహ్ జీవన చిత్రం



షెహనాయ్! ఉత్తర భారతదేశపు ఒక వాద్యం!
మంగళపూర్వక కార్యక్రమాలకు మన సన్నాయి అంతటి ప్రాచుర్యాన్ని పొందిన ఆ వాద్య విశేషం ఇప్పుడిక విషాదంతో మూగబోయింది.
ఇంతకాలం ఆ వాద్యానికి మారుపేరుగా, ఆ వాద్యం పేరునే ఇంటిపేరుగా మలుచుకున్న ఒక భారతరత్నం సంగీత ప్రపంచానికి తీరని వేదనను మిగులుస్తూ వెళ్ళిపోయింది.
ఆ భారతరత్నం- బిస్మిల్లాహ్‌ఖాన్!



ఎందరో హిందూ దైవాలకు ఆయన షెహనాయ్ మేలుకొలుపు పాడింది. పరమత సహనానికి పిలుపునిచ్చింది. షెహనాయ్‌కే కొత్త అర్థాన్ని చెప్పిన సంగీత సుస్వర సామ్రాట్ 1916వ సంవత్సరం మార్చి 21వ తేదీన జన్మించారు. బిస్మిల్లాహ్‌ఖాన్ పూర్వీకులలో కొందరు కాశీ విశ్వేశ్వరుని సేవలో తరించారు. విశ్వేశ్వరుని సేవించే ఆయన మామ అలి బక్స్ దగ్గర ఓనమాలు నేర్చుకున్నారు. తర్వాత విద్వాంసునిగా ఎదిగారు. ప్రపంచవ్యాప్తంగా సంగీతాభిమానులను తన షెహనాయ్ స్వర విన్యాసాలతో అలరించారు.

సంగీత నాటక అకాడమీ అవార్డ్, పద్మవిభూషణ్, భారతరత్న ఇవన్నీ ఆయన కీర్తి కుసుమాలలో కొన్ని. దర్పమన్నది కానరాని ఓ అరుదైన వ్యక్తి-త్వాన్ని చూపే దర్పణం - బిస్మిల్లా ఖాన్ నిరాడంబర జీవనశైలి. బిస్మిల్లాఖాన్ వంశంలో గుర్తించవలసిన మరో ముఖ్య విషయం. ఆయన విద్యాప్రదాతగా హిందువులు కొలిచే దేవత సరస్వతి భక్తుడుకావడం. కాశీలో  చనిపోవాలనేది చాలామంది హిందువుల చివరికోరిక. అదే కోరిక బిస్మిల్లాఖాన్‌కూ ఉంది. అభిమానులను అశ్రుసాగరంలో ముంచుతూ, ఓ విషాద ఘడియలో ఆ కోరిక తీరింది. ఆయనలోని విద్వత్తుకు వినమ్రంగా తలవంచని శిరస్సు ఏనాడూ లేదు.
మనమూ ఆ సరస్వతీ పుత్రునికి నివాళి అర్పిద్దాం!